క్లుప్తంగా

ఆదిదేవుడికి మండల పూజ



అలంకరణలో వినాయక స్వామి

రాజంపేట టౌన్ : మండలంలోని బ్రాహ్మణపల్లె జగనన్న కాలనీలో బుధవారం వినాయక స్వామి మండల పూజను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. మండల పూజ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన వినాయక స్వామిని మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేపట్టి 41 రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజను నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రైతాంగాన్ని ఆదుకోండి

రాయచోటి అర్బన్ : సాగుచేసిన పంటలను తీవ్రకరువు పరిస్థితులతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివలు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించారు. బుధవారం రాయచోటి పర్యటనలో ఉన్న మంత్రిని వారు కలుసుకుని మాట్లాడారు. జిల్లాలోని 30 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు విలయతాండవం చేస్తోందన్నారు. రైతులకు మంజూరు చేసిన పంట రుణాలను మాఫీచేయడంతోపాటు కొత్తగా రుణాలు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందచేశారు.

ఏపీఎం రవి ఆకస్మిక మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఏపీఎం రవికుమార్ బుధవారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆస్పత్రిలో మరణించారు. రవి కుమార్‌కు భార్య విక్టోరియా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట ప్రాంతాల్లో నాటుసారా, లిక్కర్, మత్తు పదార్థాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు గ్రామాల్లో జరగకుండా నిఘా పెట్టాలని, అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మౌలా తల్లి మస్తాన్‌బీ మృతి విషయం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలుసుకొని బుధవారం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు రూ.20,000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, రౌఫ్, క్రిష్టారెడ్డి, హరి, రామకృష్ణ, రత్తయ్య, డీవీ రమణ పాల్గొన్నారు.

ఘన నివాళి

రామాపురం : మండలం పరిధి హసనాపురం గ్రామం చింతలవాండ్లపల్లెకు చెందిన రామసుబ్బారెడ్డి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి రామసుబ్బారెడ్డి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని, మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కిషోర్‌ను పరామర్శిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకులు, రోళ్లమడుగు మాజీ సర్పంచ్ బుర్రు నాగేశ్వరరావు పెద్ద కుమారుడు బుర్రు కిషోర్ అనారోగ్య రీత్యా చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానిక టి.అగ్రహారంలో ఉన్న బుర్రు స్వగృహానికి బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి వెళ్లి కిషోర్‌ను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మండల పరిధిలోని మందరం రాచపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలగచెర్ల శ్రీకాంత్‌రెడ్డి తండ్రి వెలగచెర్ల తిరుమలరెడ్డి సంవత్సరీకం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొని నివాళులు అర్పించారు. అదే విధంగా పట్టణంలోని జౌళీ బజార్‌లో నివాసం ఉండే ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధే నాగసత్యనారాయణ గుప్తా ఇటీవల అనారోగ్యంతో వైద్యం పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతనిని ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

- గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళి
- స్వాతంత్య్ర సంగ్రామంలో బాపు చేసిన సేవలు గుర్తు చేసుకున్న నాయకులు
- ఆయన స్ఫూర్తి కొనసాగిద్దామంటూ పిలుపు



రాజంపేట టౌన్: గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆకేపాటి, పోలా



చిట్వేలి: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రాయచోటి (జగదాంబసెంటర్): వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు



సిద్దవటం: గాంధీజీకి నివాళి అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు



లక్కిరెడ్డిపల్లె: నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



రైల్వేకోడూరు అర్బన్: గాంధీ నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ, నాయకులు

రాజంపేట టౌన్ : జాతిపిత మహాత్మ గాంధీ మార్గం అనుసరణీయమైనదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. ఆంగ్లేయుల పాలన నుంచి భారతదేశానికి విముక్తి కలిగించి, స్వాతంత్య్రాన్ని తీసుకొచ్చిన మహోన్నతమైన వ్యక్తి గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జెనుగు కృష్ణారావు యాదవ్, ఎస్.ఈశ్వరయ్య, వడ్డే రమణ, ఏల్చూరి అశోక్‌కుమార్, సనిశెట్టి నవీన్‌కుమార్, అన్నపూర్ణ మురళీ, మిర్యాల సురేఖ, కూండ్ల రమణారెడ్డి, రాము యాదవ్, దాసరి పెంచలయ్య, శంకర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడాలి

రైల్వేకోడూరు అర్బన్ : జాతిపిత మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి అందరం పాటుపడాలని బుధవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. టోల్‌గేట్ వద్ద గాంధీ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం మనందరం పాటుపడాలని తెలిపారు. అలాగే ఆర్య వైశ్య సంఘం, వాసవీక్లబ్, నాయకులతోపాటు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కుల సంఘాలు మహాత్మడుకి నివాళులు అర్పించారు.

సత్యం, అహింసా మార్గాలు అనుసరించాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : గాంధీజీ చూపిన సత్యం, ధర్మం, అహింసా మార్గాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. బాపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మాట్లాడుతూ గాంధీజీ, అహింసా మార్గంతోనే దేశానికి స్వాతంత్య్రం సాధించామని, ప్రతి ఒక్కరూ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, జానం రవీంద్రయాదవ్, రియాజ్, సుగవాసి శ్యామ్, కోఆప్షన్ సభ్యురాలు మైమూన్, గువ్వల బుజ్జిబాబు, పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో, సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మహాత్మ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు డి.నాగేశ్వరప్ప ముఖ్య అతిథిగా హాజరై మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన భారతదేశ స్వాతంత్య్ర సాధనలో గాంధీ చేసిన త్యాగాల గురించి వివరించారు. అంతే గాకుండా మహాత్మ గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : సత్యం, అహింసలను ప్రపంచానికి చాటిన మహాత్ముడు జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్లతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మగాంధీ అడుగుజాడల్లో నడవాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ నివాసంలో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి స్వాతంత్య్రం సాధించిన నాయకులలో జాతిపిత మహాత్మ గాంధీ అగ్రగణ్యుడని అన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రమణయ్య, నరసింహారెడ్డి, ఎంపీటీసీ సుబ్బరాయుడు, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, వార్డు మెంబర్ సైమన్, రవి ఆచారి, నాగేంద్ర, బాబు, సభాపతి నాయుడు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆశయాలను సాధిద్దాం

గాలివీడు : జాతిపిత మహాత్మా గాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులుతో కలసి గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపూజీ చూపిన శాంతి బాటలో పయనించాలని, అహింసా మార్గమే ప్రపంచ శాంతికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శేఖర్ నాయక్, ఏఓ జాబీర్, గోపనపల్లె సర్పంచ్ కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ చేసిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : నేటి యువత జాతిపిత, మహాత్మగాంధీ ఆశయ సాధన వైపు అడుగులేద్దామని రాజంపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని బాలింతలకు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదే విధంగా జాతిపితకు ఘనంగా నివాళి అర్పించారు.

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పి.రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్‌లు ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలైన సత్యం, అహింస, విధానాలను అనుసరించాలని, అలాగే పిల్లలు సరైన మార్గంలో నడవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి శుభ్రపరిచారు.

పుల్లంపేట : జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని అప్పారాజుపేట సచివాలయంలో ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పెంచలయ్య, రిజ్వాన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువత అహింస మార్గాన్ని అనుసరించాలి

ఓబులవారిపల్లె : జాతిపిత మహాత్మగాంధీ అహింస మార్గం ద్వారానే భారతదేశానికి స్వాతంత్య్రం తీసుకురావడం జరిగిందని, యువత అహంస మార్గాన్ని అనుసరించాలని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. బుధవారం జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా మంగంపేట సచివాలయంలో ఆయన చిత్రపటానికి సచివాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పనులు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం

సిద్దవటం : మండల కేంద్రంలోని దిగువపేట బోయ వీధిలో బుధవారం ఉపాధి హామీ పనులు గుర్తింపు కోసం గ్రామ సభను నిర్వహించామని ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడానికి ఈ గ్రామ సభను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధి హామీ కూలీలు పనులు కల్పించిన చోట పూడిక పనులు చేసేటప్పుడు, కందకాల పనుల్లో నిర్దేశించిన లోతు, వెడల్పు ఉండాలని కూలీలకు తెలిపామన్నారు. 2025-2026 సంవత్సరాల్లో భాగంగా ఉపాధి హామీ పనులు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పక్కా భవనాలు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను డిసెంబర్ లోపు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ప్రసాద్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంటు భారతి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దసరా కానుకగా మధ్యంతర భృతి ప్రకటించాలి

రాయచోటి టౌన్ : 11వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని పీఎస్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లె ఓబుల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్‌టీయూ) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటన ఇప్పటికే ప్రకటించాల్సి ఉండగా ఆలస్యం అయ్యిందన్నారు. దీంతో ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెట్టిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు పీవి సుబ్బారెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి, జిల్లా మైనార్టీ కన్వీనర్ లియాఖత్, హబీబుర్‌రహిమాన్, నరసింహారెడ్డి, గౌస్, ఖతీబుద్దీన్, అస్మత్‌బాషా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19 మద్యం దుకాణాలు ఏర్పాటుకు కసరత్తు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ టీకే తులసి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని కోడూరు 11, చిట్వేలి 4, ఓబులవారిపల్లిలో 4 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు బుధవారం ఎక్సైజ్ సీఐ టీకే తులసి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని అనుకునేవారు ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 11న వేలం ఉంటుందని పేర్కొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌ఐగా వరుణ్ : రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐగా వరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అక్రమ మద్యం, సారా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 4, 5, 6 తేదీలలో గుంటూరులో 3రోజులపాటు నిర్వహింప తలపెట్టిన ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పిలుపునిచ్చారు. బుధవారం వారు రాయచోటిలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలుసుకుని క్రీడాపోటీల పోస్టర్లను ఆయనతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజ మాట్లాడుతూ జిల్లాస్థాయి క్రీడాపోటీలలో రాణించిన వారికి గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కడప, అన్నమయ్య జిల్లాల నేతలు మహేష్ బాబు, నరసింహారావు, జాబీర్, ఏజాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి మంచాలు, పరుపులు వితరణ



ఆసుపత్రికి మంచాలు అందజేస్తున్న దాతలు

నందలూరు : నందలూరు పీహెచ్‌సీకి లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం మంచాలు, పరుపులు వితరణ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ పోలీస్ ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ రోగులకు సదుపాయాల కల్పనకు సహకరించిన క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్ రావు, క్లబ్ ప్రెసిడెంట్ కుర్రా మణి యాదవ్, మోడపోతుల రాము, ట్రెజరర్ కొత్తపల్లి రాజాచారి, జంగంశెట్టి హరి, గాడి సునీల్ రెడ్డి, గంగాధర్, ఉప్పుశెట్టి సుధీర్, గుండు సురేష్, ఆంజనేయులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సిద్దవటం : పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించి, నికర ఆదాయం పెంచుకొనుటకు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతుసేవా కేంద్రం పరిధిలోని డేగనవాండ్లపల్లె, ఖాజీపల్లె, మంగనవాండ్లపల్లె, కడపాయపల్లె, లింగంపల్లె, టక్కోలు గ్రామాల్లో బుధవారం ఆయన క్షేత్ర సందర్శన చేశారు. ఈ పంటకు సంబంధించి రైతుల రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు పొటాష్, జింక్ వాడడం మంచిదన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించాలన్నారు. రబీలో పొద్దుతిరుగుడు, వేరుశనగ, నువ్వులు, ఆకు కూరలు, కూరగాయలు, అలసంద పంటలను సాగు చేస్తామని రైతులు తెలిపారన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం

చిన్నమండెం : 50 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్ సంచులను వాడాలని ఎంపీడీఓ దివ్య అన్నారు. బుధవారం చిన్నమండెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు మానండి–బట్ట సంచులు వాడండి అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కోసం బయో డిగ్రేడబుల్ కంపోస్ట్ సంచుల వాడకం ఆరోగ్యానికి మంచిది అని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఈఓపీఆర్‌డీ పవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజులురెడ్డి, ఏపీఓ మాధవి, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక

రామాపురం : మండల కేంద్రంలోని డాక్టర బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలోని విద్యార్థులు ఉమ్మడి కడప జిల్లా అండర్-17 బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపికైనట్లు కడప, అన్నమయ్య జిల్లాల పాఠశాల క్రీడల సెక్రటరీలు అరుణకుమారి, వసంతలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవారం మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకొని గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు, క్రీడాస్ఫూర్తితో ఆడాలని, ఎంపికలకు విచ్చేసిన విద్యార్థులకు సూచించారు. ఈ ఎంపికలో ఏపీ పీఈటీ అసోసియేషన్ కడప జిల్లా ప్రెసిడెంట్ ప్రవీణ్‌కిరణ్, స్పే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సాజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రకుమార్, అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, నరసరాజు, పీడీలు వరదరాజు, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం పాలంబాట

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె పంచాయతీ పరిధి సంటిగారిపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు. గ్రామంలోని మంచినీటి కొళాయిలకు నీళ్లు రావడంలేదని, స్థానిక మహిళలు బుధవారం తెలిపారు. నీళ్ల కోసం కిలోమీటరు దూరం వెళ్లి పంట పొలాల్లో నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామానికి కూతవేటు దూరంలో పెన్నా నది ఉన్నా మాకు నీటి సమస్య ఉందన్నారు. అధికారులు త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకు స్వంత ఇళ్లు నిర్మింపజేస్తాం



కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న మండిపల్లి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం నుంచి 3 సెంట్ల స్థలంను కేటాయింపజేయడంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని రాష్ట్రమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పిసిఆర్ కన్వెన్షన్ హాలులో మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు తరపున సుమారు 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు పాదరక్షలు, బట్టలను మంత్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం నుండి 3 సెంట్ల స్థలం ఇప్పించి, ఇళ్ళు నిర్మిస్తామన్నారు. సఫాయి మిత్ర సురక్ష కాంపొనెంట్‌లో అన్నమయ్య జిల్లా ఉత్తమ అవార్డును అందుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం విజయవాడ బుడమేరు వరద సహాయక చర్యలలో పాల్గొంచుకున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబుతో పాటు, పారిశుద్ధ్య కార్మికులకు మంత్రి శాలువాలు కప్పి మెమెంటోలు అందచేసి ఘనంగా సన్మానించారు.

ఉద్యోగులను తొలగించడం దుర్మార్గం

రాజంపేట రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన ఉద్యోగస్తులను తొలగించడమేనా సీఎం చంద్రబాబు సంపద సృష్టించడమంటే అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక మన్నూరులోని తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు ఇచ్చిన హామీలు అటకెక్కినట్లేనా అని దెప్పిపొడిచారు. సంపద సృష్టించగల సత్తా, నైపుణ్యత నాలో ఉందని ప్రజలను నమ్మించిన బాబు ఉద్యోగస్తులను తొలగిస్తూ వారి కుటుంబాలను వీధిన పడేటట్లు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం చేపట్టి 4నెలలు కావస్తున్నా వలంటీర్లకు జీతాలివ్వకుండా వారి జీవితాలతో ఆడుకుంటున్న సీఎం చంద్రబాబుకు మానవతా విలువలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 4వేల మంది ఉద్యోగులను తొలగించి చంద్రబాబు వారి కడుపుకొట్టారని ఆరోపించారు. ఇప్పుడు మద్యం షాపులలో పనిచేసే 15వేల మంది ఉద్యోగస్తుల కుటుంబాల కడుపుకొట్టేందుకు సీఎం బాబు పూనుకోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని హితవు పలికారు.

నవదుర్గ వైభవం.. శరన్నవరాత్రి శోభితం

- నేటి నుంచి దసరా సందడి షురూ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాల కమిటీలు
- రాజంపేట అమ్మవారిశాల వద్ద ఆకట్టుకుంటున్న భారీ సెట్టింగ్‌లు



రైల్వేకోడూరు అర్బన్: ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



రాజంపేట టౌన్: రెడ్డివారివీధిలోని చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద వేసిన భారీ సెట్టింగ్



రాజంపేట టౌన్: విద్యుత్‌దీపాల అలంకరణలో అమ్మవారి ప్రతిమలు

రాజంపేట టౌన్ : హిందువులకు ముఖ్యమైన పండుగలలో దసరా పండుగ ఒకటి. ఈ సందర్భంగా ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటారు. ఆశ్వయుజ శుద్ధపాడ్యమి నుంచి దశమి వరకు తొమ్మిది రోజుల పాటు వివిధ నామాలతో పిలిచే అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజిస్తారు. దసరా ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కావడంతో శరన్నవరాత్రి అని అంటారు. జిల్లా అంతటా గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. పదవరోజు పార్వేట నిర్వహిస్తారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అలంకరణలు చేశారు.

మొదలైన నవరాత్రి సందడి

దసరా సందడి రానే వచ్చేసింది. జిల్లా అంతటా ఎటుచూసినా సందడి వాతావరణమే కనిపిస్తుంది. మూడు నియోజకవర్గాల పరిధి అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల వద్ద భక్తులను కనువిందుచేసేలా అలంకరణలు చేపట్టారు. ప్రధానంగా అమ్మవారిశాలలు, వీరచౌడేశ్వరీదేవి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు భక్తులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకునేలా ఉన్నాయి.

నేడు ప్రారంభంకానున్న శరన్నవరాత్రులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రులు పురస్కరించుకొని గురువారం ఉదయం 6 గంటలకు కలశస్థాపన, అభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకం, దేవీభగవత పారాయణంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని తెలిపారు. రాత్రి దీక్షాబంధన అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి రమేష్, చలపాటి హరినాథ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠ్రావుపేటలో..

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో కొలువైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షులు చిన్నరెడ్డెయ్య తెలిపారు. 3న ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, కలశస్థాపన, దీక్షాబంధన అలంకారం ఉంటాయన్నారు. 4న శ్రీ మహాలక్ష్మిదేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న శ్రీ గజలక్ష్మిదేవిగా, 7న శ్రీ మోహినీ దేవిగా, 9న పగలు బిందెసేవ, రాత్రి సరస్వతిదేవిగా, 10న దుర్గాష్టమీ మహిషాసురమర్దిని దేవిగా, 11న మహర్నవమి, పూర్ణాహుతి, శ్రీ విజయలక్ష్మీదేవి అలంకారం, 12న విజయదశమి రాత్రి శ్రీదేవి గ్రామోత్సవం, 13న సవంతోత్సవం రాత్రికి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రతి రోజూ సాయంత్రం చింతకుంట సత్యనారాయణ గుప్తాచే శ్రీ వాసవీదేవి పురాణం పఠనం, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం ఉంటాయన్నారు.

నేటి నుంచి 12వ తేదీ వరకు..

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళ దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నేడు గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు గొర్ల మోహన్ రెడ్డి, గొర్ల భూదేవమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మది శ్రీహరి స్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి స్వామి మాట్లాడుతూ ప్రతి రోజూ అమ్మవారికి, రామలింగేశ్వరస్వామికి పూజలు, ప్రత్యేక అలంకరణలు, అలాగే ప్రతిరోజూ సాయంకాలం అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి జరుగుతుందన్నారు.